# మాలలు ఐక్యత చాటాలి

- ఉపకులాలకు అన్యాయం జరుగకుండా పోరాడతాం
- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



పద్మనాయక కళ్యాణ మండపంలో నిర్వహించిన మాల–మాల ఉపకులాల ఐక్యత అభివృద్ధి సమాశంలో మాట్లాడుతున్న చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

తెలంగాణచౌక్, నవంబర్ 3: మాలలు ఐక్యత చాటాలని, మాల–మాల ఉపకులాలకు ఎలాంటి అన్యాయం జరుగకుండా ముందుండి పోరాడుతామని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. నగరంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన మాల–మాల ఉపకులాల ఐక్యత అభివృద్ధి సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చి, మాట్లాడారు. మాలల మీద జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. గ్రామ గ్రామాన మాల కమిటీలు వేసి చైతన్య పరచాలని సంఘం నాయకులకు సూచించారు. రాజకీయాలకు అతీతంగా మాల జాతిహక్కుల సాధన కోసం పోరాడాలన్నారు. వచ్చేనెల 1న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మాలల భారీ బహిరంగ సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మల్లేపల్లి లక్ష్మయ్య, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, విశాంత్ర డీఎస్పీ దామేర నర్సయ్య, మర్రి వెంకటస్వామి, అర్షమల్లేశం, గంట కళ్యాణి–శ్రీనివాస్, కొరివి వేణుగోపాల్, బండ అనిత, మేడి మహేశ్, రవీందర్, మద్దెల రాజేందర్, నల్లల కనుకయ్య, పాల్గొన్నారు.

# కేంద్రాలు సరే.. కొనుగోళ్లేవి..?

- నెలరోజులైనా ఎందుకు కొంటలేరు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

విద్యానగర్, నవంబర్ 3: రాష్ట్రంలో వరి కోతలు నెల రోజుల కింద ప్రారంభమై ధాన్యం కేంద్రాలకు కుప్పలు తెప్పలు గా వస్తున్నదని, ఇంకెప్పుడు కొనుగోళ్లు ప్రారంభిస్తారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, ఆచరణకు పొంతనే లేకుండా పోయిందని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 7,572 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిందని, వాటిలో ఇప్పటికే 4598 కేంద్రాలను తెరిచినట్లు చెబుతున్నదని వివరించారు. అయితే తమకు అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలోనూ ఇంతవరకు వడ్ల కొనుగోలు ప్రారంభమే కాలేదని, రైతులు అరిగోసపడుతున్నారని మండిపడ్డారు. వడ్ల కుప్పలతో కేంద్రాలన్నీ నిండిపోవడంతో స్థలం లేక రోడ్లపై రాశులుగా పోస్తున్నారని, ఫలితంగా అటు రైతులకు, ఇటు వాహనదారులకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కొనుగోళ్లలో జాప్యంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు చొప్పదండి, సిరిసిల్ల మానకొండూరు, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ధాన్యం తడిసిపోయిందని, రైతులను పట్టించుకునే వారే లేరని ధ్వజమెత్తారు. వెంటనే వడ్ల కొనుగోళ్లను ప్రారంభించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా తడిసిన ప్రతి గింజను క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వడ్ల కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతుల పక్షాన అతిత్వరలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సోమవారం అన్ని మండల కార్యాలయాలకు వెళ్లి తహసీల్దార్లకు వినతి పత్రాలు ఇవ్వాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

### 7న జోనల్ స్థాయి చెస్, స్కేటింగ్ పోటీలు


కొత్తపల్లి, నవంబర్ 3 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్జీఎఫ్ జోనల్‌స్థాయి అండర్–14 , 17 స్కేటిం గ్, చెస్ ఎంపిక పోటీలను ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ నిర్వహణ జిల్లా కార్యదర్శి భాషబోయిన వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన అర్హత గల బాలురు, బాలికలు సంబంధిత జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శుల ధ్రువపత్రంతో స్కే టింగ్ క్రీడాకారులు అంబేద్కర్ స్టేడియంలో, చెస్ క్రీడాకారులు జ్యోతినగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు ఎస్జీఎఫ్ కార్యదర్శి సెల్ నెంబర్ 9396 404896 కు సంప్రదించాలన్నారు.



నగరంలో మంచినీటి సరఫరా చేసే ఫిల్టర్ బెడ్

# శివారు డివిజన్లకు ఇక రోజూ నీటి సరఫరా

- అమృత్- 2 పనులకు నేడే శ్రీకారం
- రూ.147 కోట్ల నిధులతో ఫిల్టర్ బెడ్, రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్మాణం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నిధుల మంజూరు
- ఆనందంలో ప్రజలు



కార్పొరేషన్, నవంబర్ 3: కరీంనగర శివారు డివిజన్లు, విలీన గ్రామాలకు మంచి నీటి సమస్య తీరబోతున్నది. త్వరలోనే రోజూ నీటి సరఫరా జరుగబోతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమృత్ మొదటి విడుత నిధులను సక్రమంగా వినియోగించి మంచినీటి సరఫరాలో కరీంనగరాన్ని ది బెస్ట్‌గా నిలుపడంతో అమృత్–2కు నగరపాలక సంస్థ ఎంపికైంది. నిధులు కూడా అదే సమయంలో మంజూరు కాగా, శివారు ప్రాంతాల్లో వచ్చే 30 ఏండ్లకు అనుగుణంగా అవసరమైన పనులకు యంత్రాంగం ప్రణాళికలు వేసింది. సోమవారం ఉదయం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు పనులకుశ్రీకారం చుట్టనుండగా, ప్రజానీకం సంబురపడుతున్నది.

### మొదటి విడుత సక్సెస్.. నీటి సరఫరా మెరుగు

కరీంనగర్ నగరపాలక సంస్థ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమృత్ పథకం కింద ఎంపికైంది. మొదటి విడుతలో రూ.132 కోట్లు కేంద్ర, రాష్ట్ర, నగరపాలక సంస్థ వాటాలుగా విడుదల కావడంతో నగరంలో ప్రతి రోజూ మంచినీటి సరఫరా కోసం చర్యలు తీసుకున్నారు. శాతవాహన యూనివర్సిటీల్లో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, నూతనంగా 30 ఎంఎల్‌టీ ఫిల్టర్‌బెడ్, ఆరు నూతన రిజర్వాయర్లు, పైపులైన్ పనులు చేపట్టారు. మూడేళ్లుగా నగరంలో ప్రతి రోజూ మంచినీటి సరఫరా చేస్తున్నారు. మొదటి విడుతలో వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించి దేశంలో రోజూ మంచినీటి సరఫరా చేస్తున్న నగరపాలక సంస్థగా కరీంనగర్‌ను నిలుపడంతో అమృత్–2 కింద ఎంపికైంది. ఈ విషయంలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రూ.147 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి.

### అమృత్-2లో 30 ఏండ్లకు అనుగుణంగా పనులు

నగరంలో మంచినీటి సరఫరాను మరింతగా మెరుగు పర్చుకునేందుకు అమృత్–2 కింద కేంద్ర ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ పథకం కింద చేపట్టే పనులకు కేంద్ర ప్రభుత్వం 40 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 50, నగరపాలక సంస్థ 10 శాతం నిధులను వెచ్చించనున్నాయి. నగరంలోని 9 విలీన గ్రామాలు, నూతనంగా వచ్చిన శివారుప్రాంతాల్లో రాబోయే 30 ఏళ్లలో పెరిగే జనాభాను అంచనా వేసుకొని ప్రతి రోజు మంచి నీటి సరఫరా చేసేందుకు రూ.147 కోట్లతో పనులు చేపట్టనున్నారు. ఇందుకు 10 ఎంఎల్‌డీ ఫిల్టర్‌బెడ్‌తో పాటు, రేకుర్తి గుట్టపై బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ఆయా గ్రామాల్లోనూ నూతనంగా ఎనిమిదికి పైగా రిజర్వాయర్లు, పైపులైన్లు నిర్మించనున్నారు. ఈ పనులన్నీ వచ్చే తొమ్మిది నెలల్లో పూర్తి చేయనున్నారు. పనులన్నీ పూర్తయితే ఇక నుంచి శివారు ప్రాంతాల్లోనూ ప్రతి రోజు మంచి నీటి సరఫరా కానున్నది.

### ప్రతి రోజూ నీరందిస్తాం..

నగరంలోని పాత డివిజన్ల పరిధిలో ప్రతి రోజు మంచినీటి సరఫరాను దిగ్విజయంగా కొనసాగిస్తున్నాం. అతి త్వరలోనే హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలోని 5వేల ఇండ్ల కు 24 గంటల మంచినీటి సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అమృత్–2 ప నులూ పూర్తయితే నగర శివారు డివిజన్లతోపాటు విలీన గ్రామాలకు ప్రతి రోజూ నీరందిస్తాం. నిధులు వచ్చేందుకు అవకాశం ఇ చ్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, పథకం లో ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

- యాదగిరి సునీల్‌రావు, కరీంనగర్ మేయర్

# రైల్వేశాఖ కాపర్ వైర్ చోరీలో ట్విస్ట్‌లు

- రంగంలో దిగిన కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు
- నేడు గోదాం సందర్శన, విచారణకు రాక



పట్టుబడిన దొంగలను చూపెడుతున్న పోలీసులు (ఫైల్)

జమ్మికుంట, నవంబర్ 3: రైల్వేశాఖకు చెందిన విలువైన కాపర్ వైరు చోరీ కేసు రోజుకో మలుపు తిరుగుతున్నది. కాపర్ వైర్ మాది కాదని జమ్మికుంట గోదాం ఇన్‌చార్జి జగదీశ్‌దాసు (ఫిర్యాదుదారుడు) అంటున్నాడు. జయంత్ ఇన్‌ఫ్రా కంపెనీకి చెందిన గోదాంలోనిదేనని కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు, దొంగలను అరెస్టు చేశారు. సొత్తు రికవరీ చేశారు. ఇదిలా ఉండగానే, సివిల్ పోలీసులకు సంబంధం లేకుండా ప్రత్యేక దర్యాప్తు కోసం వరంగల్ జిల్లా కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు రంగంలో దిగారు. సోమవారం జమ్మికుంటకు రానున్నారు. చోరీ జరిగిందని కేసు నమోదైన గోదాంను సందర్శించనున్నారు. రికార్డుల పరిశీలనతో పాటు వివరాలను సేకరించనున్నారు.

### అసలేం జరిగింది..?

రైల్వే విద్యుత్ లైన్‌కు సంబంధించిన కాంట్రాక్టు పనులను కిరణ్ అనే వ్యక్తి చేస్తున్నాడు. స్థానికంగా జయంత్ ఇన్‌ఫ్రా కంపెనీకి చెందిన గోదాంను అద్దెకు తీసుకున్నాడు. రైల్వే లైన్‌కు చెందిన కాలం చెల్లిన పాత వైర్లను తొలగించి, కొత్త వైర్లను వేశాడు. పాత వైర్, తదితర సామగ్రిని గోదాంలో నిల్వ చేసుకున్నాడు. అయితే గత నెల 29న గోదాంలో కాపర్ వైరు చోరీ జరిగిందని గోదాం ఇన్‌చార్జి జగదీశ్‌దాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. 30న విచారణ కోసం పోలీసులు గోదాంకు వచ్చారు. విచారణ సమయంలో గోదాంలో చోరే జరగలేదని, కాపర్ వైరు మాది కాదని ఇన్‌చార్జి జగదీశ్‌దాసు పోలీసులతో వాదించాడు. పోలీసులు కాపర్‌వైర్ దొంగల వద్ద స్వాధీనం చేసుకున్న తర్వాత తనను స్టేషన్‌కు పిలిపించుకొని ఫిర్యాదు తీసుకున్నారని ఆరోపిస్తున్నాడు. ఇదిలా ఉండగానే, ఈ నెల 1న పోలీసులు ప్రెస్‌మీట్ పెట్టారు. దొంగలను అరెస్టు చూపారు. 500 కిలోల కాపర్ వైర్‌ను రికవరీ చేశామని, మరో దొంగ పరారీలో ఉన్నాడని, ఇందులో ప్రమేయమున్న మహిళలు, తదితరులపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవి తెలిపారు.

### సీరియస్‌గా తీసుకున్న ఆర్పీఎఫ్

చోరీ జరిగిన సొత్తు రైల్వేశాఖది. పాత విద్యుత్ వైర్‌ను తొలగించిన తర్వాత శాఖకు అప్పగించే బాధ్యత కాంట్రాక్టర్‌దని తెలుస్తున్నది. కాంట్రాక్ట్ పనులన్నీ పూర్తి చేసుకున్న తర్వాత శాఖకు ఇవ్వాల్సి ఉంటదని సమాచారం. జమ్మికుంటలో కాంట్రాక్టర్ కిరణ్‌కూ గోదాం ఉంది. అయితే పోలీసులు కాపర్ వైరును, దొంగలను 29న పట్టుకున్నారా..? అంతకుముందే పట్టుకున్నారా..?గోదాం ఇన్‌చార్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కాపర్ వైర్‌ను, దొంగలను పట్టుకున్నారా..? చోరీ ఇక్కడి నుంచే చేశామని దొంగలు చెప్పినప్పటికీ కాంట్రాక్టర్, సిబ్బంది మాది కాదనడం, తదితర అంశాలపై ఆనేక అనుమానాలున్నాయనే స్థానికంగా చర్చ జరుగుతోంది. మరి కాపర్ వైర్ ఎవరిది..? కాపర్ వైర్ చోరీలో అనేక ట్విస్టులున్నాయి. తేలాల్సి ఉంది. కాగా, కాపర్ వైర్ దొంగతనం కేసులో కాజీపేట ఆర్పీఎఫ్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. చోరీపై విచారణకు జమ్మికుంటకు వస్తున్నామని సీఐ సంజీవరావు చెప్పారు.

# రాబడి

## గోల్డ్ VS నిఫ్టీ 50

### పదేండ్ల క్రితం పెట్టిన పెట్టుబడిపై ఎందులో ఎంత రాబడి?

**మనలో** చాలామంది బంగారం కొంటే లాభమా?.. స్టాక్ మార్కెట్లలో మదుపు చేస్తే లాభమా?.. అన్న డైలమాలో ఉంటారు. అయితే భౌతిక బంగారం, ఈక్విటీలు రెండూ దీర్ఘకాల పెట్టుబడి సాధనాలే. కనుక ఈ రెండింటిపై పెట్టే పెట్టుబడులను స్వల్పకాలానికి ఏది లాభమన్నది తేల్చలేం. కాబట్టి పదేండ్ల క్రితం అటు బంగారంపై, ఇటు నిఫ్టీ 50లో రూ.10 లక్షల చొప్పున పెట్టుబడి పెడితే ఇప్పుడు మదుపరికి ఎంత? రావచ్చున్నది ఒక్కసారి చూద్దాం. అంతకంటేముందు బంగారం పట్ల భారతీయుల వైఖరి, స్టాక్ మార్కెట్ల చరిత్రను పరిశీలిద్దాం.

**బంగారం**


- మన దేశంలో భౌతిక బంగారానికి సహజ స్వరూపం నగలే.
- భారతీయులు బంగారాన్ని తమ ప్రతిష్టకు, సంపదకు ప్రతిరూపంగా భావిస్తారు.
- ఇటీవల సురక్షిత పెట్టుబడి సాధనంగా కూడా పరిగణిస్తున్నారు.
- ఆభరణాలు, నాణేలు, కడ్డీలు, బిస్కట్ల రూపంలో పుత్తడిని కొంటున్నారు.
- ఇంట్లో శుభకార్యాలతోపాటు దీపావళి తదితర పండుగలు, అక్షయ తృతీయ, ధనత్రయోదశి రోజుల్లో ఎక్కువగా కొనుగోళ్లు.
- జ్యుయెల్లర్స్, బ్యాంకులు, వ్యాపారుల ద్వారా జరుగుతున్న పసిడి లావాదేవీలు.
- నగల రూపంలో బంగారం కొన్నప్పుడు అందులో తయారీ, తరుగు చార్జీలుంటాయి. తిరిగి అమ్మినప్పుడు వాటిని మినహాయించి చెల్లించడం జరుగుతుంది.
- పసిడి అమ్మకాల ద్వారా ఆదాయం పొందినప్పుడు స్వల్ప లేదా దీర్ఘకాల మూలధన లాభాల పన్నును చెల్లించాల్సి ఉంటుంది.
- బంగారం అనేది ఎంతో విలువైన లోహం. అపహరణకు వీలెక్కువ. అందుకే భద్రంగా నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది.

**నిఫ్టీ 50**

- ఎన్ఎస్ఈ నిఫ్టీ అనేది.. భారత్‌లోని రెండు ప్రధాన స్టాక్ మార్కెట్ సూచీల్లో ఒకటి. మరొకటి బీఎస్ఈ సెన్సెక్స్.
- 1996 ఏప్రిల్ 21న నిఫ్టీ 50 మొదలైంది. బ్యాంకింగ్, ఐటీ, మెటల్స్, ఫార్మా వంటి 12 రంగాలకు చెందిన టాప్ 50 కంపెనీలు ఇందులో నమోదై ట్రేడ్ అవుతూ ఉంటాయి.
- నిఫ్టీ 50లోని కంపెనీల మూలాలు బలమైనవి. వాటి వ్యాపారాలు పెద్ద ఎత్తున సాగుతాయి. కాబట్టే దేశంలోని అత్యంత స్థిరమైన సూచీల్లో నిఫ్టీ కూడా ఒకటిగా ఉంటున్నది.
- నిజానికి ఎన్ఎస్ఈలో నిఫ్టీ 50 అనేది ప్రధాన ఇండెక్స్. దీంతో పాటు నిఫ్టీ నెక్స్ట్ 50, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ బ్యాంక్ సూచీలూ ఉన్నాయి.

**ఇదీ సంగతి..**


- 2014లో బంగారంపై సురేశ్ రూ.10 లక్షల పెట్టుబడి పెట్టారు. ఈ పదేండ్లలో పసిడి ధరల్లో వార్షిక వృద్ధిరేటు 12.18 శాతంగా నమోదైంది. అంటే 2014 అక్టోబర్‌లో 24 క్యారెట్ 10 గ్రాములు (తులం) రూ.25,500గా ఉన్నది. ఇప్పుడు రూ.82,400. దీన్నిబట్టి రూ.10 లక్షల పెట్టుబడి విలువ కాస్తా దాదాపు రూ.31,55, 294.12కు చేరుతుంది.



- ఇక పదేండ్ల క్రితమే నిఫ్టీ 50 షేర్లలోనూ రూ.10 లక్షల పెట్టుబడిని సురేశ్ పెట్టారు. 2014 అక్టోబర్‌లో నిఫ్టీ 50 ఉన్న స్థాయితో పోల్చితే ఇప్పుడున్న స్థాయి 11.31 శాతం ఎక్కువ. దీన్నిబట్టి సదరు రూ.10 లక్షల పెట్టుబడి రూ.29,19,971.16 కోట్లకు చేరుతుంది. దాదాపు రెండూ ఒకే స్థాయిలో రాబడులను పంచుతున్నాయి. అయితే బంగారం ధరల్లో హెచ్చుతగ్గులున్నట్టే.. స్టాక్ మార్కెట్లలోనూ ఒడిదొడుకులు సహజం.

# భద్రం.. బీకేర్‌ఫుల్ బ్రదర్

## ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే అంతే సంగతి..



**ప్రతీ** ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం. అయితే అది లేక కొందరు, అది ఉన్నప్పటికీ అవగాహన లేక తప్పుడు నిర్ణయాలు తీసుకొని మరికొందరు పెద్ద ఎత్తున మూల్యం చెల్లించుకుంటున్నారు. మరి నిపుణులేమంటున్నారో చూద్దాం.

**అవగాహనతో..**

ప్రతీదానిపై అవగాహన ఉంటేనే లాభమైనా.. విజయమైనా దక్కుతుంది. ముఖ్యంగా ఎలాంటి అవగాహన లేకుండా, విచారణ చేయకుండా తొందరపడి నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టడం నష్టాలకు దారితీయవచ్చు. స్టాక్ మార్కెట్లపై విశ్లేషణ చేసి, పూర్తిగా రిసెర్చ్ చేశాకే ఓ నిర్ణయానికి రావడం ఉత్తమం. ఈక్విటీ మార్కెట్లపై అవగాహనను పెంచుకోవడానికి అసలు సమయమే లేని చిన్న మదుపరులు ఈ పెట్టుబడులకు దూరంగా ఉండటమే లాభదాయకం. అయితే మ్యూచువల్ ఫండ్స్ ద్వారా స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు దిగడం ఒకింత తెలివైన పనేనని నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ మీకొచ్చే ఆదాయం మార్కెట్ ఒడుదొడుకులకు లోబడే ఉంటుందన్నది మరువద్దు. మొత్తానికి ఎక్స్‌పర్ట్స్ సలహాలతో ముందుకెళ్తేనే ప్రయోజనం.

**అతితో అనర్థాలే..**

కొందరు ఏం చేసినా అపరిమిత స్థాయిలోనే ఉంటుంది. ఈ క్రమంలోనే విపరీతంగా స్టాక్స్‌ను కొంటూంటారు. అలాగే ఫండ్స్‌నూ అదేస్థాయిలో రకరకాల పెట్టుబడి సాధనాల్లోకి మళ్లిస్తూ ఉంటారు. అయితే వైవిధ్యం అనేది వ్యూహమే అయినా.. ఒక మోతాదు దాటితే దుష్పరిణామాలకే దారితీస్తుంది. ఓ సర్వే ప్రకారం మీ పోర్ట్‌ఫోలియోలో వివిధ రంగాల నుంచి 15–20 శాతం స్టాక్స్.. మీకున్న రిస్క్‌ను తగ్గిస్తుంది. ఇంతకు మించితే ఎటువంటి లాభమూ దక్కదు. కాబట్టి స్టాక్స్ కొనుగోలు, నిధుల మళ్లింపుల్లో అతి పనికిరాదు.

**బీమాను మరువద్దు**

ప్రతీది పన్ను కోణంలో చూడవద్దు. పెట్టుబడులైనా, బీమా అయినా పన్ను మినహాయింపులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవద్దు. ముఖ్యంగా బీమా పాలసీల విషయంలో ఈ రకమైన ఆలోచన శ్రేయస్కరం కాదు. ఎందుకంటే పన్ను మినహాయింపుల కోసం బీమా పాలసీలను తీసుకుంటే.. కావాల్సిన ప్రయోజనాలను మీరు కోల్పోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనకు అవసరమైన బీమాలో భాగంగానే పన్ను ప్రయోజనాలు దక్కలిగానీ.. మొత్తం పాలసీనే నిరుపయోగంగా మార్చవద్దని హితవు పలుకుతున్నారు. అలాగే సమగ్రరీతిలో కవరేజీ ఉన్న పాలసీలనే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఒకటికి మించి బీమా పాలసీలుంటే మంచిదే అయినప్పటికీ.. మీమీ ఆర్థిక అనుకూలతలనూ పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.

**రుణ భారం**

అవసరమున్నా, లేకున్నా నేడు చాలామంది మితిమీరిన రుణ భారాన్ని తలకెత్తుకుంటున్నారు. బ్యాంకింగ్, నాన్–బ్యాంకింగ్ సంస్థల నుంచి వస్తున్న ఆఫర్లతో కొందరు.. క్రెడిట్ కార్డు సంస్థల నుంచి వస్తున్న ప్రకటనలతో మరికొందరు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీనివల్ల జీవితంలో రాజీపడి బ్రతకాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. కాబట్టి అప్పుచేసి పప్పుకూడు ఎప్పటికీ మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆదాయ–వ్యయాల మధ్య అంతరాలను తెలుసుకొని జీవించాలంటున్నారు. అనవసరపు కోర్కెలను తీర్చుకోవడానికి చేసే అప్పులు.. మున్ముందు గృహ రుణం వంటి కీలక లక్ష్యాల సాధనను ఆంటకపర్చే వీలుకూడా లేకపోలేదు. కాబట్టి అప్పుల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**చివరగా..**

ప్రతి ఒక్కరూ తమ ఆర్థిక స్థోమతను తెలుసుకొని ప్రవర్తించాలి. ప్రధానంగా ఇటీవలి కాలంలో అన్ని రంగాల్లో స్థిరత్వం లోపించింది. ఉద్యోగాలను కోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే కనీసం 6 నెలల అవసరాలు తీరేలా అత్యవసర నిధి ఉండాలి. సురక్షితమైన పెట్టుబడులకు పెద్దపీట వేస్తూనే.. పొదుపునకూ ప్రాధాన్యత ఇవ్వాలి. వీలుంటే రుణ భారాన్ని తగ్గించుకోవాలి. అవసరం మేరకే ఖర్చులుండాలి. విస్తృత శ్రేణి ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను తీసుకోండి. అడ్డగోలు రాబడులనిచ్చే మోసపూరిత స్కీములకు దూరంగా ఉండండి. తొందరపాటుతో కాకుండా ఓ ప్రణాళికతో ముందుకెళ్తే విజయాలు సొంతమవుతాయి.

**పొదుపుతోనే రక్ష**

పొదుపును ఎప్పుడూ అశ్రద్ధ చేయవద్దు. ప్రతీ వ్యక్తికి ఉండాల్సిన ఆర్థిక క్రమశిక్షణలో తెలివైన పెట్టుబడులకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో.. పొందికైన పొదుపునకూ అంతే స్థానం ఉంటుంది. యుక్త వయస్సు నుంచే సేవింగ్స్‌ను అలవాటు చేసుకుంటే ఆకర్షణీయ లాభాలను పొందవచ్చు. ముఖ్యంగా అనుకోని ఖర్చులను తేలిగ్గా అధిగమించవచ్చు. ఇక నేటి యువతలో చాలామందికి కెరియర్ ప్రారంభంలోనే మంచి ఉద్యోగాలు, పెద్ద జీతాలు దక్కుతున్నాయి. అయితే క్రెడిట్ కార్డులు, ఖరీదైన మొబైల్ ఫోన్లు.. ఇలా లైఫ్‌ను ఎంజాయ్ చేయడంపైనే దృష్టి పెడుతున్నారు. కానీ అత్యవసర పరిస్థితుల కోసం సేవింగ్స్‌పై మాత్రం మొగ్గు చూపడం లేదు. కనుక పొదుపుపై నిర్లక్ష్య ధోరణి వీడాలి.



# కొత్తగా.. కొనుగోళ్ల దిశగా!

**మార్కెట్ పల్స్**

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో కొత్త ఏడాది (సంవత్ 2081) మొదలైంది. గత శుక్రవారం జరిగిన మూరత్ ట్రేడింగ్‌లో నూతన సంవత్సరానికి మదుపరులు లాభాలతోనే స్వాగతం పలికారు. అప్పటిదాకా నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న సూచీలు.. ఈ ప్రత్యేక ట్రేడింగ్‌తో లాభాలను సంతరించుకున్నాయి. ఫలితంగానే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 321.83 పాయింట్లు పెరిగి 79,724.12 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 123.55 పాయింట్లు అందుకుని 24,304.35 దగ్గర స్థిరపడింది. ఈ క్రమంలో ఈ వారం ఇన్వెస్టర్లు పెట్టుబడులకే మొగ్గుతారన్న అంచనాలైతే వస్తున్నాయి. బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాల షేర్లపై ఫోకస్‌కు ఛాన్స్ ఉన్నది. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,700 స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,600–24,800 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.


*గమనిక..:* స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

# పకడ్బందీగా పాస్‌వర్డ్

## ఆర్థిక మోసాలకు చెక్ పెట్టండిలా

**పాస్‌వర్డ్‌లు** అనేవి ఎంతో కీలకం. ముఖ్యంగా ఆర్థికపరమైన లావాదేవీల్లో వీటి ప్రాధాన్యత చాలా ఎక్కువ. అలాంటి ఈ పాస్‌వర్డ్‌ల విషయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా భారీ నష్టాలు తప్పవు. అందుకే పాస్‌వర్డ్‌ల నిర్మాణం, దాని భద్రత అంశంలో ఈ జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. అవేంటో చూస్తే..

- మొబైల్/ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోవద్దు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులకు చెప్పాల్సి వస్తే.. సదరు లావాదేవీ పూర్తయిన వెంటనే కొత్త పాస్‌వర్డ్‌ను మార్చుకోవాలి.
- అత్యంత క్లిష్టతరంగా, ఎవరి ఊహలకు అందనివిధంగా ఈ పాస్‌వర్డ్‌ల నిర్మాణం ఉంటే మంచిది. డిక్షనరీ వర్డ్స్‌ను వాడటం వల్ల పాస్‌వర్డ్‌లను సైబర్ మోసగాళ్లు ఊహించే వీలున్నది.
- మాతృ భాషకు చెందిన అక్షరాలు లేదా మీకు మాత్రమే తెలిసిన తేదీలు, రకరకాల చిహ్నాలను పెట్టుకోవాలి. అప్పుడే డీ కోడింగ్‌కు కష్టమవుతుంది.
- ప్రతీ 3 లేదా 6 నెలలకోసారి పాస్‌వర్డ్‌లను మారిస్తే ఉత్తమం. సుదీర్ఘకాలంపాటు ఒకే పాస్‌వర్డ్‌ను వాడటం వల్ల సైబర్ మోసగాళ్లబారినపడే ప్రమాదం పొంచి ఉంటుంది.
- కనీసం 16 అక్షరాలతో పాస్‌వర్డ్ ఉండాలి. పాస్‌వర్డ్ ఎంత పెద్దదైతే దాన్ని కనిపెట్టడం మోసగాళ్లకు అంత కఠినమవుతుందనే విషయం గుర్తుంచుకోండి.



- ఉచిత వైఫైలను వాడరాదు. ఎయిర్‌పోర్ట్, రైల్వే స్టేషన్, హోటళ్లలో ఫ్రీగా వస్తుందని ఉపయోగిస్తే మీ ఇంటర్నెట్ బ్రౌజింగ్ ఇతరులకు తెలిసే వీలున్నది. ఈ సమయంలో ఆర్థిక లావాదేవీలను అస్సలు జరుపవద్దు. పిన్ నెంబర్లను హ్యాకర్స్ సులభంగా పసిగట్టగలరు.
- పాస్‌వర్డ్‌లను మొబైల్ ఫోన్లలో సేవ్ చేసుకోవద్దు. ఫోన్ హ్యాక్ అయినప్పుడు అందులోని విలువైన డాటా కూడా దొంగతనానికి గురవుతుంది.